## పొరపాట్లు లేకుండా ఇండ్ల గణన పకడ్బందీగా చేపట్టాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్



**మాసాయిపేట్, డైనమిక్ న్యూస్** జనగణన తొలి విడతలో భాగంగా నిర్వహించే ఇండ్ల గణనను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం టేక్మాల్ మండల కేంద్రంలో ఇండ్ల గణన ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మే 11 నుంచి జూన్ 9 వరకు జరిగే ఇండ్ల గణన ప్రక్రియను కచ్చితత్వంతో నిర్వహించాలని సూచించారు. ఒక రెవెన్యూ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని గరిష్టంగా 300 ఇండ్లు లేదా 800 జనాభా మేరకు బ్లాకులు రూపొందించాలని తెలిపారు. ఈ ప్రక్రియను సి ఎం ఎం ఎస్ పోర్టల్ ద్వారా ఎలాంటి తప్పిదాలు లేకుండా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్, ఎంపీడీవోలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పేటలో చికెన్ సెంటర్ల బంద్ -- భారీ నిరసన



**సూర్యాపేట, డైనమిక్ న్యూస్** కార్పొరేట్ ఫౌల్ట్రీ యజమానులు టెండర్లలో చిన్న దుకాణాలకు ఇచ్చే మార్జిన్ తగ్గించడంతో నష్టాలు వస్తున్నాయని ఆరోపిస్తూ పట్టణంలోని చికెన్ సెంటర్ యజమానులు బంద్ చేపట్టారు. చికెన్ సెంటర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ రోజువారీగా చికెన్ ధరల్లో మార్పులు చేయడం వల్ల వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని ఫౌల్ట్రీ యజమానులతో చర్చలు జరిపి చిన్న వ్యాపారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థలు గతంలోలాగే సరైన మార్జిన్ ఇవ్వాలని, వినియోగదారులు కూడా తమ పరిస్థితిని అర్థం చేసుకుని సహకరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు, స్థానిక వ్యాపారులు పాల్గొన్నారు.

## మహనీయుల జయంతులు ఘనంగా నిర్వహించాలి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**డైనమిక్ న్యూస్, సూర్యాపేట** మహనీయుల జయంతి ఉత్సవాలను వారి స్ఫూర్తితో ఘనంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ముందస్తు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ నెలలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతుల సందర్భంగా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమ స్థలాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా, తాగునీరు, టెంట్లు వంటి సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యాసంస్థల్లో మహనీయుల జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించి యువతలో అవగాహన పెంచాలని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలను ఆహ్వానించి కార్యక్రమాలను సామరస్యంగా నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామ సభల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. తుంగతుర్తిలో అంబేద్కర్ భవన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని, ఏప్రిల్ 14 నాటికి పనులు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## దాదాయిపల్లి గ్రామంలో నిరసన జ్వాల

### నిధులు మంజూరు చేయకుంటే గ్రామ సభ బహిష్కరణ




**టెక్మల్,డైనమిక్ న్యూస్** మెదక్ జిల్లా టెక్మల్ మండలం దాదాయిపల్లి గ్రామంలో నిధుల కేటాయింపులో అన్యాయం జరుగుతుందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర గ్రామాలకు ఎస్‌హెచ్‌జి భవనాలు మంజూరు చేసినప్పటికీ, తమ గ్రామాన్ని విస్మరించారని ఆరోపించారు. గ్రామ అభివృద్ధికి కీలకమైన ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలు కూడా నిలిచిపోవడంతో సర్పంచ్ దేశ్‌పాండే నరసింహారావు ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారులను కలిసినా స్పందన లభించలేదన్నారు. ఈ నేపథ్యంలో రేపు జరగనున్న గ్రామ సభను బహిష్కరించాలని గ్రామస్తులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. నిధులు విడుదల చేసి, ఎస్‌హెచ్‌జి భవనం మంజూరు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని గ్రామ కమిటీ స్పష్టం చేసింది.

## ఆళ్వార్ ప్రసన్నోత్సవం ఘనంగా నిర్వహణ



**డైనమిక్ న్యూస్, హుజూర్‌నగర్** శ్రీ ఆది వరహ లక్ష్మీనరసింహ వేణుగోపాల స్వామి దేవస్థానంలో ఆళ్వార్ ప్రసన్నోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం శాత్తుమరై, ఉపదేశ రచనమాల మంగళాశాసనాలతో కార్యక్రమం పూర్తయింది. సాయంత్రం విశ్వక్సేన ఆరాధన, పుణ్యావచనం, ధ్వజ విన్యాసం, రిత్విక్ కరణం, రక్షాబంధనం, అంకురారోపణ, మృచ్ఛంగ్రహణం, తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎంపీ లక్ష్మణరావు, చైర్మన్ యరగాని భిక్షం గౌడ్, ధర్మకర్తలు, అర్చకులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న బిజెపి పార్టీ జనరల్ సెక్రెటరీ ఏశం నవీన్ యాదవ్



**డైనమిక్ న్యూస్ మాసాయిపేట్** మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం మాసాయిపేట మండలం కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో ఫ్యాన్ లేకపోవడంతో చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గమనించి అంగన్వాడీ టీచర్ భూదేవి కు హామీ ఇచ్చి నెరవేర్చుకున్నారు మాసాయిపేట మండల బీజేపీ పార్టీ జనరల్ సెక్రటరీ ఏశం నవీన్ యాదవ్ వెంటనే స్పందించి, తన వంతు సహాయంగా అంగన్వాడీ కేంద్రానికి ఫ్యాన్‌ను అందజేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్యం మరియు సౌకర్యం ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని తెలిపారు.

స్థానిక ప్రజలు మరియు అంగన్వాడీ సిబ్బంది ఈ సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు.

## వైభవంగా అయ్యప్ప స్వామి జన్మదినోత్సవాలు

**చిలుకూరు, డైనమిక్ న్యూస్** చిలుకూరు గ్రామంలో అయ్యప్ప స్వామి జన్మదినోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కొండలు గురుస్వామి, గోపయ్య గురుస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, పాలు, పెరుగు, తేనె, నెయ్యితో అభిషేకాలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దర్శనం చేసుకున్నారు. ఆలయం పూలతో అలంకరించగా, భక్తి గీతాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. సాయంత్రం హారతి కార్యక్రమం ఆకట్టుకుంది. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మాట్లాడుతూ కార్యక్రమం విజయవంతంగా జరిగిందని తెలిపారు.

## జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి: కలెక్టర్



**సూర్యాపేట బ్యూరో, డైనమిక్ న్యూస్** మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. డా. బాబు జగ్జీవన్ రామ్, డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతుల ఏర్పాట్లపై జరిగిన సమావేశంలో మాట్లాడిన ఆయన, కార్యక్రమాలు సమన్వయంతో నిర్వహించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు.

## హయాన్ చంద్రకు ఎస్పీ ఆర్థిక సాయం



**సూర్యాపేట బ్యూరో, డైనమిక్ న్యూస్** ఆటిజం సమస్యతో బాధపడుతున్న సీనియర్ జర్నలిస్ట్ తల్లాడ చందన్ కుమారుడు హయాన్ చంద్రకు జిల్లా ఎస్పీ నరసింహ ఆర్థిక సాయం అందించారు. సోషల్ మీడియాలో వచ్చిన కథనానికి స్పందించిన ఎస్పీ, బాబుకు మెరుగైన వైద్యం కోసం పోలీస్ శాఖ తరపున సహాయం చేశారు. ఈ సందర్భంగా హయాన్ చంద్ర త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## శాలిగౌరారం మండలంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన -- ప్రభుత్వ పనులపై సమీక్ష



**నల్గొండ బ్యూరో, డైనమిక్ న్యూస్** నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ బుధవారం సుడిగాలి పర్యటన నిర్వహించి ప్రభుత్వ సంస్థలు, అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. వల్లాల, అడ్లూరు గ్రామాల్లో పర్యటించిన ఆయన వనమహోత్సవం నర్సరీలు, పల్లె ప్రకృతి వనం, ఉపాధి హామీ పనులు పరిశీలించారు. వర్షాకాలానికి ముందే మొక్కలు నాటే స్థలాలు గుర్తించాలని, గ్రామసభల్లో ప్రజాభిప్రాయం తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు నీడ, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. అలాగే ఎక్కువ పనులు చేసి మంచి వేతనం పొందేలా కూలీలను ప్రోత్సహించారు. తెలంగాణ మోడల్ స్కూల్‌లో తాగునీటి ప్లాంట్ మరమ్మతులు, గ్యాస్‌పై వంట, డెస్కుల ఏర్పాటు తక్షణమే చేయాలని ఆదేశించారు. అడ్లూరు గ్రామ అంగన్వాడీ కేంద్రం, గ్రామ సమాఖ్య భవనాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. గ్రామ సమస్యలను గ్రామసభల్లో చర్చించి పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మీసేవ సేవల చార్జీల పెంపు

**నల్గొండ బ్యూరో, డైనమిక్ న్యూస్** రాష్ట్ర ప్రభుత్వం మీసేవ సేవల చార్జీలను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. ఏ" కేటగిరి చార్జీలు రూ.35 నుంచి రూ.62కు, "బి" కేటగిరి రూ.45 నుంచి రూ.80కు పెరిగాయి. బిల్లుల చెల్లింపు చార్జీలు కూడా పెరిగాయి. అలాగే విద్యుత్ డిస్కం చెల్లింపులపై వివిధ స్థాయిల్లో ఫీజులు పెంచినట్లు వెల్లడించారు. నిర్దేశించిన చార్జీలకు మించి వసూలు చేస్తే మీ సేవ నిర్వహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

## ముఖ్య అతిథిగా కీసర సంతోష్ రెడ్డి సీసీ రోడ్డు శంకుస్థాపన



**డైనమిక్ న్యూస్, మోతే** మోతే మండలం రాఘవపురం ఎక్స్ రోడ్డు గ్రామంలో రూ.10 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు గ్రామ సర్పంచ్ కోల లింగయ్య గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కీసర సంతోష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. ఇప్పటికే రూ.20 లక్షలతో సీసీ రోడ్లు మంజూరు చేసినట్లు, గ్రామపంచాయతీ భవనం మరియు మహిళా సంఘ భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయని చెప్పారు. అలాగే ఇటీవల రూ.5 లక్షలు, రూ.10 లక్షలతో మరిన్ని సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు వట్టిపల్లి నాగమల్లయ్య గౌడ్, ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## కొత్తగూడెంలో చాకలి వాగులు అక్రమ ఇసుకతో తవ్వకాలను పరిశీలించిన ఆర్డివో



**డైనమిక్ న్యూస్ మోతే ఏప్రిల్ 01** మోతే మండలం కొత్తగూడెం చాకలి వాగులు అక్రమ ఇసుక తవ్వకాలను పరిశీలించిన ఆర్డిఓ వేణుమాధవ్ మండల రెవెన్యూ ఆఫీసర్ వెంకన్న కొత్తగూడెం గ్రామానికి చెందిన 8 మంది ట్రాక్టర్ యజమాను గుర్తింపు బైండోవర్ చేయాలని ఆదేశాలు వాగులోకి వాహనాలు వెళ్ళకుండా కందకాలు తవ్వకాలు చేయించిన రెవిన్యూఇన్స్పెక్టర్ కర్ణాకర్ రెడ్డి స్థానికుల ఫిర్యాదు మేరకే వాగు పరిశీలన

## బెట్టింగులకు పాల్పడితే చర్యలు తప్పవు మోతే ఎస్సై అజయ్ కుమార్



**డైనమిక్ న్యూస్ మోతే ఏప్రిల్ 01** మోతే మండల సబ్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్లు కొనసాగుతున్న నేపథ్యంలో యువత డబ్బు ఆశతో బెట్టింగులకు పాల్పడ కూడదని మోతేఎస్సై టీ అజయ్ కుమార్ హెచ్చరించారు. సులభంగా డబ్బు సంపాదించాలని ఆశపడి బెట్టింగులలో పాల్గొంటే ఆర్థికంగా నష్టం పోవడంతోపాటు చట్టపరమైన సమస్యలు కూడా ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయని అన్నారు

## గొల్లగూడెంలో తాగునీటి ఎద్దడి తీవ్రం



**టేక్మాల్, డైనమిక్ న్యూస్** టేక్మాల్ మండలంలోని గొల్లగూడెంలో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని 13, 14వ వార్డుల్లో సింగిల్ ఫేజ్ మోటార్ చెడిపోయి రెండు రోజులు గడిచినా పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీటి సరఫరా లేకపోవడంతో వ్యవసాయ బోరు బావులపై ఆధారపడాల్సి వస్తోందని తెలిపారు. సమస్యను పలుమార్లు తెలియజేసినా అధికారులు స్పందించకపోవడంపై గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వెంటనే మోటార్ మరమ్మత్తులు పూర్తి చేసి నీటి సరఫరా పునరుద్ధరించాలని, లేకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

## 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలి ఏఐటీయూసీ డిమాండ్




**హుజూర్ నగర్, డైనమిక్ న్యూస్** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 4 లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన పిలుపు మేరకు హుజూర్ నగర్‌లో కార్మికులు నల్ల రిబ్బన్లు ధరించి బ్లాక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్త లేబర్ కోడ్స్ వల్ల కార్మికుల హక్కులు దెబ్బతింటాయని, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా చట్టాలు మారుతున్నాయని విమర్శించారు. సోషల్ సెక్యూరిటీ పేరిట కార్మికులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, ట్రేడ్ యూనియన్ల పిలుపు మేరకు హైదరాబాద్‌లో ర్యాలీ నిర్వహించి లేబర్ అధికారులకు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమాల్లో వివిధ కార్మిక, రైతు, రాజకీయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

